సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 5 । జూన్ । 2023



ఇరువర్గాల ఘర్షణ
నూజివీడు మండలంలోని సిద్ధార్థనగర్‌లో ఇరువర్గాల ఘర్షణలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు గాయపడినట్టు పోలీసులు తెలిపారు. 8లో



గుబ్బల మంగమ్మకు పూజలు
కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు చేశారు. 8లో

ప్లాస్టిక్‌ను పారదోలుదాం
ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతోంది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు అనే నినాదంతో పలు దేశాలు ముందుకు వెళుతున్నాయి. 8లో



న్యూస్‌రీల్

రాట్నాలమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదవేగి : భక్తుల పాలిట కొంగుబంగారం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి ఒక్కరోజు పూజా టికెట్ల ద్వారా రూ.47,645, విరాళాల రూపంలో రూ.7,221, లడ్డూ విక్రయాల ద్వారా రూ.17,850, ఫొటోల అమ్మకంపై రూ.2,200 మొత్తంగా రూ.74,916 ఆదాయం సమకూరినట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్ తెలిపారు. దేవస్థానం చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్



విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న అధికారి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేశంలోని ఐఐటీల్లో ప్రవేశాల నిమిత్తం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ఏలూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులకు రెండు పేపర్లను ఉదయం, మధ్యాహ్నం రెండు పరీక్షలుగా నిర్వహించారు. కేంద్రాల వారీగా ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్‌లో 145 మందికి 140 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో 85 మందికి 83 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 140 మందికి 136 మంది హాజరయ్యారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎం.కృష్ణ, సిద్ధార్థ క్వెస్ట్‌లో ఎ.శ్రీనివాసరావు, ఏలూరు ఇంజనీరింగ్‌లో పి.బాలకృష్ణ ప్రసాద్ పరీక్షలను పర్యవేక్షించారు.

విద్యుత్ అధికారుల బదిలీలు

నూజివీడు: ఏపీసీపీడీసీఎల్ నూజివీడు డివిజన్‌లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈఈ డి.కృష్ణనాయక్ ఉయ్యూరుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఒంగోలు నుంచి ఎ.సత్యనారాయణ ఇక్కడకు రానున్నారు. ఈయన బాధ్యతలు సైతం స్వీకరించారు. అలాగే అన్నవరం సబ్ ఇంజినీర్ త్రిమూర్తులు యనమలకుదురు సబ్ ఇంజినీర్‌గా బదిలీ కాగా, ఆయన స్థానంలో తిరువూరు రూరల్ సబ్ ఇంజినీర్ గౌరినాయుడు అన్నవరానికి బదిలీ అయ్యారు. మీర్జాపురం సబ్ ఇంజినీర్ ప్రసాద్ రింగురోడ్డు సెక్షన్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

యువకుడి దుర్మరణం

సహాయక చర్యలకు హోం మంత్రి ఆదేశం



వంశీ మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలం నవాబుపాలెం ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఉంగుటూరుకు చెందిన తాడేపల్లి వంశీ (25) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుని స్వగ్రామం కృష్ణాయపాలెం కాగా, ప్రస్తుతం ఉంగుటూరులో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మృతుడు దుబాయ్ నుంచి ఉంగుటూరు వచ్చాడు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో పెళ్లికి హాజరయ్యేందుకు ఉంగుటూరు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది. అదే సమయంలో కొవ్వూరు వైపు నుంచి తాడేపల్లిగూడెం వస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన మృతుని బంధువులతో మాట్లాడి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించి, రూరల్ ఎస్సై వీఎస్ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తండ్రి శ్రీనివాసరావు, ఇద్దరు సోదరులు ఉన్నారు. ఉపాధి నిమిత్తం తల్లి దుబాయ్‌లో ఉంటున్నారు.

హమ్మయ్య.. అంతా క్షేమం

ఊపిరి పీల్చుకున్న ఉమ్మడి 'పశ్చిమ'

- కోరమండల్ దుర్ఘటనలో ఉమ్మడి జిల్లావాసులు సురక్షితం
- కొనసాగుతున్న హెల్ప్‌డెస్క్‌లు
- విజయవాడ డివిజన్ పరిధిలో 12 రైళ్ల రద్దు
- ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్న ప్రయాణికులు



ఏలూరు రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న హెల్ప్‌డెస్క్



ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడి ఏలూరు చేరుకున్న పిల్లి శ్రీకర్‌బాబు

ఏలూరు (టూటౌన్): ఒడిసాలో జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని తాడేపల్లిగూడెం, ఏలూరు స్టేషన్లలో దిగాల్సిన ప్రయాణికులు సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద ఘటన వార్త తెలియగానే జిల్లాకు చెందిన వారి క్షేమ సమాచారాలపై పలువురు ఆరా తీయడం కనిపించింది. జిల్లాకు చెందిన ప్రయాణికులు సురక్షితంగా బయటపడాలంటూ అందరూ కోరుకున్నారు. జిల్లా ప్రయాణికులు నలుగురు క్షేమంగా ఉండగా.. వీరిలో ఇద్దరు తాడేపల్లిగూడెంలో, మరొకరు ఏలూరు చేరుకున్నారు. ఏలూరులో దిగాల్సిన మరొకరు తిరిగి వెనక్కి హౌరా వెళ్లినట్టు రైల్వే అధికారులు తెలిపారు. అయితే రైలు ప్రమాదంతో విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రైల్వే ఉన్నతాధికారులు రద్దు చేయగా రోజువారీ ప్రయాణికులు, ముందస్తుగా రిజర్వేషన్లు చేసుకున్న వారు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణ తేదీకి తాము వెళ్లాల్సిన రైలు రద్దు కావడంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

కొనసాగుతున్న హెల్ప్‌డెస్క్‌లు

ఏలూరు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్ ఆదివారం కొనసాగింది. అత్యవసర సమాచారం కోసం ఏలూరు హెల్ప్‌లైన్ నంబర్ 08812- 232267ను సంప్రదించాలని స్టేషన్ సూపరింటెండెంట్ ఎన్‌వీ రమేష్ కోరారు. తాడేపల్లిగూడెంలో హెల్ప్‌డెస్క్ కొనసాగుతుందని 9490617090 నంబర్‌లో సంప్రదించాలని అక్కడి రైల్వే పోలీసులు తెలిపారు. వీటికి అదనంగా ఏలూరు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేశారు.

గమ్యస్థానాలకు ప్రయాణికులు

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఘటన నుంచి సురక్షితంగా బయటపడిన తెలుగు ప్రజలు శనివారం అర్ధరాత్రిలోపు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకున్నారు. భువనేశ్వర్ నుంచి బయలుదేరిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు వచ్చారు. వీరిలో ఇద్దరు తాడేపల్లిగూడెంలో, ఒకరు ఏలూరు రైల్వేస్టేషన్‌లో దిగారు. రైల్వే శాఖ చెన్నై వరకూ ప్రత్యేక రైలు నడిపింది. ప్రమాదం నుంచి బయటపడిన వారంతా వారి గమ్యస్థానాలకు చేరుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రయాణికుల ఇబ్బందులు

కోరమండల్ దుర్ఘటనతో పాటు ఆపరేషన్ కారాణాల వల్ల విజయవాడ డివిజన్ పరిధిలో పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలో 12 రైళ్లు రద్దయ్యాయి. శనివారం నుంచి ఈనెల 9వ తేదీ వరకూ ఏడు రోజులపాటు రైళ్లు రద్దు కావడంతో ఇప్పటికే ఆయా రైళ్లలో రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణాలకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా విజయవాడ-రాజమండ్రి, విజయవాడ-కాకినాడ పోర్టు, గుంటూరు-విశాఖ, విజయవాడ-విశాఖ మధ్య తిరిగే అప్ అండ్ డౌన్ రైళ్లు రద్దు కావడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు స్టేషన్ల మీదుగా ప్రయాణించే వారంతా ఇబ్బంది పడుతున్నారు. రైళ్ల సమాచారం కోసం ప్రయాణికులు హెల్ప్‌లైన్లు, నేరుగా స్టేషన్ అధికారులను సంప్రదిస్తున్నారు.

దిక్కుతోచని సీజనర్లు

సీజనల్ టికెట్లతో ప్రయాణించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు స్టేషన్ల నుంచి వందల సంఖ్యలో ఉద్యోగులు, చిరు వ్యాపారులు ప్రతిరోజూ సీజన్ టికెట్లపై ప్రయాణిస్తుంటారు. రైళ్ల రద్దుతో వీరంతా ఆర్టీసీ బస్సులు, మోటార్ సైకిళ్లు, ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

చార్జీలు పెంచిన ప్రైవేట్ ట్రావెల్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో పలు రైళ్లు రద్దు కారణంగా ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ ట్రావెల్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ట్రావెల్స్ నిర్వాహకులు అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రధానంగా విశాఖ, హైదరాబాద్, గుంటూరు వంటి నగరాలకు ముందుగా రిజర్వేషన్లు చేసుకున్న వారు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేట్ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఏలూరు నుంచి విశాఖకు గతంలో రూ.600 టికెట్ ధర ఉండగా ప్రస్తుతం రూ.100 పెంచి మినిమం చార్జీ కింద రూ.700, స్లీపర్, ఏసీ బస్సులకు రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ సర్వీసులకు కూడా ఇదేరీతిలో అదనపు చార్జీలను వసూలు చేస్తున్నట్టు ప్రయాణికులు చెబుతున్నారు.

చిరు వ్యాపారుల ఇబ్బందులు

ఉమ్మడి జిల్లా పరిధిలో పలు రైళ్ల రద్దుతో రైళ్లలో తినుబండారాలు, టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్, పండ్లు విక్రయించే చిరు వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. వారంపాటు రైళ్లు రద్దు కావడంతో జీవనాధారానికి ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.

రాష్ట్రస్థాయిలో రెండు గ్రామాల గుర్తింపు

- భీమడోలు, దుద్దేపూడిలో 6న కేంద్ర బృందం పర్యటన
- జెడ్పీ సీఈఓ రవికుమార్ వెల్లడి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్

భీమడోలు: స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాల అమలులో ఏలూరు జిల్లాలోని భీమడోలు, దుద్దేపూడి పంచాయతీలు గుర్తింపు పొందాయని, ఈనెల 6న స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి జితేంద్ర శ్రీవాత్సవ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కార్యనిర్వాహక డైరెక్టర్ జి.వెంకట మురళీ ఆయా గ్రామాల్లో పర్యటిస్తారని జెడ్పీ సీఈఓ కేవీఎస్ఆర్ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు మండలాల గ్రామ కార్యదర్శులు, స్వచ్ఛభారత్ అనుబంధ అధికారులతో డీపీఓ ఏవీ విజయలక్ష్మితో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. కేంద్ర బృందం పర్యటనలో భాగంగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సహకరించేందుకు ఇతర మండలాలకు చెందిన అధికారులను సభ్యులుగా చేరుస్తూ కమిటీలను నియమిస్తారన్నారు. జిల్లాలో 27 బ్లాకులు, 537 గ్రామ పంచాయతీలు, 708 గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. వీటిలో 57 గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత ఆదర్శ గ్రామాలుగా ఎంపికయ్యాయని, 606 గ్రామాలు ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు. 18 గ్రామాల్లో ప్రతిభ కొనసాగుతుందని, ఇదే క్రమంలో ఆయా గ్రామాల్లో 5,802 సింగిల్ పిట్, 5,957 సెప్టిక్ ట్యాంకులు, 5,387 ఇంకుడు గుంటలు, 1,505 తిరిగి వాడే అవకాశం గల సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం పూర్తయిందన్నారు. 64 గ్రామాల్లో సుజలం కార్యక్రమం కొనసాగుతోందన్నారు. భీమడోలు పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ నిర్వహణ, పర్యావరణ, పారిశుద్ధ్య పరిరక్షణ ఇతర అంశాల్లో 500 మార్కులకు 372 మార్కులు పొందిందన్నారు. కేంద్ర బృందం ఆయా అంశాల అమలు తీరుపై గ్రామాల్లో పరిశీలన చేస్తుందన్నారు. డీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్‌ను వాడరాదని, గుడ్డతో తయారీ చేసిన ఫ్లెక్సీలను వాడాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్‌వీ సత్యనారాయణ, ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, స్వచ్ఛభారత్ జిల్లా-కోఆర్డినేటర్ శిరీషా, డీఎల్‌పీఓ అన్నామణి పాల్గొన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమాల అమలుతీరును డీపీఓతో కలిసి జెడ్పీ సీఈఓ పరిశీలించారు. భీమడోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ తీరు బాగుందని ఆయన కొనియాడారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

జేసీ లావణ్యవేణి



పోలవరంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి, ఎస్పీ మేరీ ప్రశాంతి

పోలవరం రూరల్: పోలవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 6న పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనకు సీఎం జగన్ రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. సీఎం జగన్ పోలవరం ప్రాజెక్టులోని ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్‌లో పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం అధికారులతో సమీక్షిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రాజెక్ట్ పనులు పరిశీలించే ప్రాంతాల్లో ప్రాజెక్ట్ నిర్మాణ పనుల ప్రగతికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటుచేయాలని, టెంట్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించాలన్నారు. హెలీప్యాడ్ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలనీ, ప్రముఖులు కూర్చునేందుకు వీలుగా టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. సీఎం పర్యటన ప్రదేశాల్లో విస్తృత బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, అసిస్టెంట్ కలెక్టర్‌లు అపూర్వ భరత్, శ్రీపూజ, ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సుధాకరబాబు, ఆర్డీఓలు కె.పెంచల కిశోర్, ఝాన్సీరాణి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, తహసీల్దార్ సుమతి, అధికారులు ఉన్నారు.

సీఎం పర్యటన సాగేదిలా..

ఏలూరు (మెట్రో): సీఎం జగన్ ఈనెల 6న పోలవరం పర్యటనకు సంబంధించి షెడ్యూల్ ఖరారైంది.

- సీఎం జగన్ ఉదయం 9.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 10.20 గంటలకు పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతానికి చేరుకుంటారు.
- ప్రజాప్రతినిధులతో మాట్లాడిన అనంతరం ఉదయం 11.30 నుంచి 11.50 గంటల వరకు పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు.
- ప్రాజెక్ట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 11.50 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 1 గంటకు కాన్ఫరెన్స్ హాల్ నుంచి బయలుదేరి 1.05 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.35 గంటల వరకు హెలీప్యాడ్ వద్ద స్థానిక నాయకులతో మాట్లాడి 1.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా తిరిగి తాడేపల్లి బయలుదేరతారు.

రూ.13 కోట్లతో తూడు నిర్మూలన

- జిల్లాలో చురుగ్గా పనులు
- కాలువలు, డ్రెయిన్ల శుభ్రతకు చర్యలు
- ముందస్తుగా వరద సామగ్రి సిద్ధం



బొండపాడు డ్రెయిన్‌లో తూడు నిర్మూలనకు స్ప్రే చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): సాగు, తాగునీరు అందించే పంట కాలువలు, మురుగు, ముంపు నీటిని బయటకు పంపించే డ్రెయిన్ల శుభ్రతకు అధికారులు చర్యలు చేపట్టారు. ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో సాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా తూడు నిర్మూలన, తొలగింపు పనులు చేస్తున్నారు. జిల్లాలో పంట కాలువలు, డ్రెయిన్లలో ముందుగా తూడు నిర్మూలన కోసం స్ప్రే పిచికారీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తూడు కుళ్లిన తర్వాత దానిని కాలువల నుంచి తొలగిస్తున్నారు. ఇలా జిల్లాలో 20 ప్రధాన పంట కాలువలు, 25 డ్రెయినేజీల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.13 కోట్లతో..

జిల్లాలో తూడు తొలగింపునకు 20 పంట కాలువలకు రూ.7 కోట్లు, 25 డ్రెయినేజీలకు రూ.6 కోట్ల చొప్పున ఖర్చు చేయనున్నారు.

రూ.20 లక్షలతో వరద మెటీరియల్

ఏటా వర్షాకాలంలో వరదల వల్ల కాలువలు, డ్రెయిన్లను ఆనుకుని ఉన్న పంట పొలాలకు నష్టం వాటిల్లుతోంది. దీనిని నివారించేలా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలతో ముందస్తుగానే వరద ముంపు నీరుకు అడ్డుకోవడానికి మెటీరియల్ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో కాలువలు, డ్రెయిన్లకు సంబంధించి ప్రధానంగా ఏడు ముంపు ప్రాంతాలను ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో వరద పోటును అడ్డుకోవడానికి రూ.20 లక్షలతో ముందస్తుగా సర్వే బాదులు, తడికలు, ఇసుక బస్తాలు తదితర మెటీరియల్స్ సిద్ధం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇరిగేషన్ సబ్ డివిజన్లు		డ్రెయినేజీ సబ్ డివిజన్లు	
తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, నరసాపురం		తాడేపల్లిగూడెం, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు	
ప్రధాన పంట కాలువలు	4	ప్రధాన డ్రెయిన్లు	6
బ్రాంచ్ కాలువలు	150	చిన్న డ్రెయిన్లు	120

ముమ్మరంగా పనులు



జిల్లాలో 20 పంట కాలువలు, 25 డ్రెయిన్లలో తూడు నిర్మూలన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా తూడును నిర్మూలించి తర్వాత దానికి కాలువల నుంచి తొలగించేలా చర్యలు తీసుకున్నాం. అలాగే భారీ వర్షాలకు కాలువలు, డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించే సమయంలో వరద పోటుకు గండ్లు పడే ప్రాంతాలను గుర్తించాం. అక్కడ వరద పోటును తట్టుకునేలా రూ.20 లక్షలతో మెటీరియల్ సిద్ధం చేస్తున్నాం. ఖరీఫ్‌కు కాలువల ద్వారా సాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూస్తాం.

–పి.నాగార్జునరావు, ఇరిగేషన్ ఎస్ఈ, భీమవరం

ఈదురుగాలులు.. భారీ వర్షం





తాడేపల్లిగూడెంలో వాహనాలపై పడిన ఇనుప పరంజా, ధ్వంసమైన విగ్రహం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, పరిసర గ్రామాల్లో ఆదివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. రాత్రి 8.30 గంటలకు ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలుల ధాటికి పట్టణంలోని ఉషా గ్రాండ్ సమీపంలో షాపింగ్‌మాల్ ఆధునీకరణలో భాగంగా ఏర్పాటుచేసిన ఇనుప పరంజా ఎగిరి రోడ్డుపై వెళుతున్న కార్లు, ద్విచక్రవాహనాలపై పడింది. దీంతో పలు వాహనాలతో పాటు ఇక్కడే ఉన్న డాక్టర్ ప్రసాద్ విగ్రహం ధ్వంసమయ్యాయి. ప్రజలు భయంతో ఉరుకులు, పరుగులు పెట్టారు.

ఏజెన్సీలో జోరువాన

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే సాయంత్రం 7 గంటల సమయానికి ఒక్కసారిగా ఆకాశంలో కారుమబ్బులు కమ్మి, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. ఇదిలా ఉండగా ఏజెన్సీ ప్రాంతంలో రోజూ సాయంత్రం సమయంలో తీవ్రగాలులతో వర్షం కురుస్తూనే ఉంది. ఈ గాలులకు అలివేరు, ఎర్రాయిగూడెం, లంకపాకల, రేపల్లె, రేగులపాటు తదితర గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి.



తాడేపల్లిగూడెంలో వర్షం కురుస్తున్న దృశ్యం

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ తల్లికి ఘనంగా పూజలు



గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం అటవీప్రాంతంలో కొలువై పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు లారీలు, మినీ వ్యాన్‌లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో తరలివచ్చి మంగమ్మ తల్లికి పూజలు చేశారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



కేపీ పాలెం బీచ్‌కు తరలివచ్చిన సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు వేడి గాలులు వీయడంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదదీరారు. అనంతరం తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగ స్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం



- నేడు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం
- ఈ ఏడాది నినాదం ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు
- 2027 నాటికి ప్లాస్టిక్ రహిత ఏపీ లక్ష్యంగా అడుగులు



కైకలూరు: ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో ఏటా జూన్ 5న నిర్వహించే అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు అనే నినాదం ముందుకెళ్తున్నారు. 143 దేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్య సమితి నివేదికల ప్రకారం మానవులు సంవత్సరానికి 430 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

దేశంలో 975 కిలోమీటర్ల పొడవుతో రెండో అతి పెద్ద తీర ప్రాంతంగా ఆంధ్రప్రదేశ్ కొనసాగుతోంది. మన తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా సముద్రంలోకి చేరుతున్నాయి. ప్రధానంగా మైక్రోప్లాస్టిక్ మనం తినే ఆహారం, తాగేనీరు, పీల్చే గాలిలో ప్రవేశిస్తోంది. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలచరాల ఊపిరి తీయడంతో పాటు భూమి, వాయు, జల కాలుష్యాలకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణ చట్టం 2011 ప్రకారం 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నిషేధించారు. తర్వాత 75 ఇప్పుడు 120 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌పై నిషేధాజ్ఞలు విధించారు.

ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2027 నాటికి ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది ఆగస్టు 26న విశాఖపట్నంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్, అప్ సైక్లింగ్ హబ్‌లకు శ్రీకారం చుట్టారు. వ్యర్థాలతో ఉత్పత్తుల తయారీకి 16 ఇన్నోవేషన్ హబ్స్‌కు రూ.16 వేల కోట్ల పెట్టుబడులతో దాదాపు 20 వేల మందికి ఉపాధి అవకాశాలు ఈ ప్రాజెక్టు ద్వారా నెరవేరనున్నాయి. ప్లాస్టిక్ బ్యానర్లను బ్యాన్ చేశారు. సముద్ర తీర ప్రాంతాన్ని పరిరక్షించుకోవడం కోసం అందరూ కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. అదే విధంగా 'పుడమి సాక్షిగా' పేరుతో సాక్షి ఛానల్ ద్వారా పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నారు.

కాలుష్యపు కోరల్లో కొల్లేరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 77,138 ఎకరాల విస్తీర్ణంలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. విజయవాడ, గుడివాడ, హనుమాన్ జంక్షన్, ఏలూరు వంటి ప్రాంతాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా పది వేల క్యూసెక్కుల నీరు వరదల సమయంలో కొల్లేరుకు చేరుతుంది. కొల్లేరు సరస్సులో ఏటా 17 వేల టన్నుల వ్యర్థాలు కలుస్తాయని గతంలో జియోగ్రాఫికల్ రీసెర్చ్ సర్వే అంచనా వేసింది. వీటిలో ఎక్కువగా ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలు ఉంటున్నాయి. ఇవి కొల్లేరులో జీవించే సహజజాతి చేపల మనుగడకు ప్రమాదంగా మారాయి.

నిషేధం అమలుకు కమిటీలు

ప్లాస్టిక్ నిషేధ చట్టం అమలుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఉన్నాయి. కలెక్టరు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, పొల్యూషన్ బోర్డు, పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీ అధికారులతో కమిటీలు పనిచేస్తున్నాయి. నిబంధనలు పాటించని తయారీదారులకు రూ.25 వేల నుంచి రూ.50 వేలు, చిల్లర వ్యాపారులకు రూ.2500 నుంచి రూ. 5వేలు, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ సంచులు వేస్తే రూ.250 నుంచి రూ.500 వరకూ జరిమానా విధించే అవకాశం ఉంది.

భూమిలో విచ్ఛిన్నమవడానికి ఎంత సమయం
న్యూస్ పేపరు – 4 నుంచి 6 వారాలు
సిగరెట్ చివరి ఫిల్టర్ మొన – ఒకటి నుంచి 5 సంవత్సరాలు
క్యారీ బ్యాగ్ – 20 సంవత్సరాలు
కాఫీ కప్ – 30 సంవత్సరాలు
ప్లాస్టిక్ స్ట్రా – 200 సంవత్సరాలు
ప్లాస్టిక్ వాటర్ బాటిల్ – 450 సంవత్సరాలు
ప్లాస్టిక్ టూత్ బ్రష్ – 500 సంవత్సరాలు
డిస్పోజల్ డైపర్ – 500 సంవత్సరాలు

పర్యావరణానికి పెను ప్రమాదం



విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం పెను ప్రమాదానికి దారి తీస్తుంది. ఉష్ణతాపం పెరిగి వాతావరణ కాలుష్యంతో పాటు ప్రాణాంతక వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్ వాడకాన్ని అధికారికంగా నిషేధించినా వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు ఉద్యమంగా కదలాలి. కాలుష్య నియంత్రణ మండలి ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– ప్రొఫెసర్ పీటా బాబీ వర్ధన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం

ఐదేళ్లుగా అలుపెరుగని పోరాటం



ప్లాస్టిక్ నిషేధం కోసం ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నాను. సేవ్ వాటర్, ఎర్త్, ఎన్విరాన్‌మెంట్ ఫ్రం ప్లాస్టిక్(స్వేప్) పేరుతో ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాను. పంచాయతీ కార్యదర్శులు హానికర ప్లాస్టిక్ విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కైకలూరులో మౌనదీక్ష చేపట్టాం. ప్రజలు క్యారీబ్యాగులకు బదులుగా జ్యూట్, కాటన్ బ్యాగ్‌ల వాడకాన్ని అలవర్చుకోవాలి.

– పి.పవన్‌కాంత్, న్యాయవాది, కైకలూరు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు మిల్కీ రాజు

కైకలూరు(కలిదిండి): రహదారులపై ప్లాస్టిక్ డబ్బాలు సేకరించి విక్రయించే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆదివారం మృతి చెందాడు. కలిదిండి ఎస్‌ఐ మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం పడమటిపాలెం గ్రామానికి చెందిన యేళ్ళ మిల్కీరాజు(57) కలిదిండి బస్టాండ్ వద్ద డబ్బాలు సేకరిస్తుండగా వాహన ఢీకొట్టిందన్నారు. తీవ్రంగా గాయపడిన అతనిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడని తెలిపారు. సోదరుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏలూరు వెళ్ళి పింఛన్ అందజేత



ఏలూరులో పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీరు

ముసునూరు: మండల కేంద్రం ముసునూరుకు చెందిన మద్దాల యోనాతాన్ అనారోగ్యానికి గురికావడంతో ఏలూరు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన స్వగ్రామానికి వచ్చి పింఛన్ అందుకోలేని పరిస్థితి. దీంతో వలంటీరు రంగమ్మ ఆదివారం ఏలూరు వెళ్లి యోనాతాన్‌కు పింఛన్ అందజేశారు. వలంటీరును జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీటీసీ చీలి లక్ష్మీ అర్లప్ప తదితరులు అభినందించారు.

గురుభట్లగూడెంలో చోరీ

చింతలపూడి: చింతలపూడి మండలం గురుభట్లగూడెంలో విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. గ్రామంలో నలుగురు రైతులకు చెందిన మోటార్లు, విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రైతులు చింతలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు జాహ్నవి



పోటీలకు ఎంపికైన విద్యార్థిని నున్న జాహ్నవి

దెందులూరు: అండర్–19 జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన దెందులూరు మండలం, పోతునూరు గ్రామానికి చెందిన నున్న జాహ్నవి జూన్ 6 నుంచి ఢిల్లీలో జరిగే పోటీలకు ఆంధ్రా జట్టుతో కలిసి ఆదివారం బయలుదేరి వెళ్లింది. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విధంగానే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని పోతునూరు, దెందులూరు మండలం ప్రజలు వ్యాయామ ఉపాధ్యాయులు, జాహ్నవి స్నేహితులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త వేతన ఒప్పంద కమిటీకి సహకరిస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

సాక్షి, భీమవరం: ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులకు నూతన వేతన ఒప్పందం కోసం యాజమాన్యం కమిటీ ఏర్పాటు చేస్తే ఎంప్లాయిస్ యూనియన్ పూర్తిగా సహకరిస్తుందని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సయ్య అన్నారు. భీమవరంలో ఆదివారం ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవాడలో జరిగాయని ఈ మహాసభలో రాష్ట్రంలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించామన్నారు. అధ్యక్షుడు పలిసెట్టి దామోదర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం కార్మికుల సమస్యలు పెరిగాయని కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎండీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ అలీ, జోనల్ కార్యదర్శి వైఎస్ రావు, బి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమారి

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో 8 నెలల గర్భిణి ఆదివారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వేలేరుపాడు మండలం కన్నాయిగుట్టకు చెందిన ధర్మల కుమారి(25) చింతలపూడి వెళ్ళి డిస్టెన్స్ పరీక్షలు రాసి పుట్టిల్లు మడకవారిగూడెంకు సోదరుడు నితిన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుంది. లక్ష్మీపురం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో కుమారి అక్కడికక్కడే మృతి చెందగా నితిన్‌కు స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కుమారి మృత దేహాన్ని జంగారెడ్డిగూడెం తరలించగా గాయపడిన నితిన్‌ను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి



రొయ్యల చెరువు వద్ద రాఘవులు మృతదేహం

కైకలూరు: ఆక్వా చెరువులపై విద్యుత్ తీగలు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. గోపవరం గ్రామానికి చెందిన గెడ్డాడ రాఘవులు(26) వింజరం సమీపంలోని రొయ్యల చెరువు సాగు చేస్తున్నాడు. గట్టుపై వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌లో అక్కడికక్కడే ఆదివారం మరణించాడు. తండ్రి భాస్కరరావు ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి రాఘవులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గోపవరం నివాసం వద్ద మృతదేహానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుమారుడు శ్యామ్ నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గోయెంకా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1975-78 బీకాం బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాలుగున్నర దశాబ్దాల క్రితం వారు కలిసి చదువుకున్నారు. పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం చదివి అనంతరం ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయాలు స్థిరపడ్డారు. ఇంతకాలానికి మళ్లీ తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అతి కష్టం మీద అందరి చిరునామాలు సంపాదించి ఒకచోట కలిశారు. ముచ్చట్లు పంచుకున్నారు. 1975–78 బీకాం డిగ్రీ పూర్వ విద్యార్థుల గెట్ టూ గెదర్ తాడేపల్లిగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. 55 మంది పైగా కుటుంబాలతో హాజరయ్యారు. అందరికీ దాదాపు 65 సంవత్సరాలు పైబడ్డాయి. పూర్వ విద్యార్థుల నాయకుడు మండలి హనుమంతరావు ప్రోత్సాహంతో ముంగర వెంకట సాయిరాం, కృష్ణ ప్రసాద్‌లు పర్యవేక్షించారు. జానకి రామారావు, జంధ్యాల నాగేశ్వరరావు, వల్లూరి రవి, టి.సుబ్బారావు, టి.రాజారావు తదితరులు పాల్గొని పూర్వ ముచ్చట్లు చెప్పుకున్నారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, అప్పటి పూర్వ విద్యార్థి కర్రి భాస్కరరావును అతిథిగా గౌరవించారు. ప్రస్తుత ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్‌బాబుకు సత్కారం జరిగింది. మృతి చెందిన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులకు నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



మృతుడు శ్రీను(ఫైల్)

చాట్రాయి: మనస్తాపంతో పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సోమవరం గ్రామంలో జరిగింది. కలవల శ్రీను(45)ఈ నెల 23న గ్రామ సర్పంచ్ ఉప్పాల శోభన్‌బాబు కుటుంబాన్ని తిట్టాడు. దీంతో గ్రామంలో కొంత మంది శ్రీనుతో గొడవ పడ్డారు. 24న ఉదయం శ్రీను పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కూర్చుని సమస్యను పరిష్కరించుకోవాలని ఇన్‌చార్జ్ ఎస్సై వెంకటేష్ సూచించారు. అయితే సర్పంచ్ కుటుంబాన్ని తిట్టినందుకు పంచాయతీ పెట్టి రూ.లక్ష కట్టాలని గ్రామ పెద్దలు చెప్పారు. ఒకటో తేదీన కడతామని శ్రీను ఒప్పుకున్నాడు. అయితే మనస్తాపం చెందిన అతను శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాత్నం చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న బంధువులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ ఉప్పాల శోభన్‌బాబుతో పాటు మరో 11 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు నూజివీడు సీఐ అంకబాబు తెలిపారు. ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని ఇంటికి తీసుకు వచ్చారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా సీఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఇరు వర్గాల ఘర్షణ

నలుగురికి తీవ్ర గాయాలు



దాడిలో గాయపడిన గాజుల శిరీష



దాడిలో గాయపడిన జరపల ఏసు

నూజివీడు: మండలంలోని సిద్ధార్థనగర్‌లో ఇరు వర్గాల ఘర్షణలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో నలుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జరపల చిలకమ్మ ఫిర్యాదు ప్రకారం సిద్ధార్థనగర్‌కు చెందిన జరపల త్రిమూర్తులు, జరపల ఏసు అన్నదమ్ములు. ఏసు ఇంట్లో ఈనెల ఒకటిన అతని కుమార్తె వివాహం జరిగింది. పెళ్లి సందర్భంగా ఏసు ఇంటి ఎదురుగా ఉన్న గాజుల మురళీకృష్ణకు ఉన్న కోళ్ల దొడ్డిలో ఖాళీ స్థలాన్ని అడిగితే మురళీ నిరాకరించాడు. శనివారం రాత్రి ఏసు పెళ్లికుమారుడిని, పెళ్లికూతురిని తీసుకురావడానికి వెళ్లగా వారికి భోజనాలు వండటానికి జరపల చిలకమ్మ ఏసు ఇంటికి వచ్చింది. రాత్రి 8 గంటల సమయంలో ఆమె చెత్త వేయడానికి బయటకు రాగా మురళీ వచ్చి చిలకమ్మ చేయి పట్టుకోగా ఆమె కేకలు వేసింది. ఆమె భర్త త్రిమూర్తులు కూడా కేకలు వేయడంతో మురళీ అక్కడే ఉన్న కర్రను తీసుకొని త్రిమూర్తులుపై దాడిచేశారు. మురళీ మావయ్య బుజ్జిబాబు, అత్త రంగమ్మ, భార్య శిరీష, బావ మరిదిలు వచ్చి కొట్టడంతో జరపల బాల, చిలకమ్మ, ఏసులు గాయపడ్డారు. వీరిని ఏరియా ఆసుపత్రిలో చేర్చగా, మెరుగైన చికిత్స కోసం త్రిమూర్తులను విజయవాడ తరలించారు. మరో వైపు గాజుల శిరీష కూడా ఫిర్యాదు చేసింది. ఏసు ఖాళీ స్థలం ఇవ్వమని అడిగితే ఇవ్వలేదని.. అయితే శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఏసు తండ్రి జరపల బాల(58) తమ స్థలంలో టాయ్‌లెట్ పోస్తుంటే చూసి అడిగానని.. బాల కేకలు వేయడంతో అతని ఇద్దరు కుమారులు త్రిమూర్తులు, ఏసులు వచ్చి తనతో గొడవకు దిగారన్నారు. తండ్రీ కొడుకులు తన భర్తపై దాడి చేశారని ఇంతలో మా నాన్న, అమ్మలైన భిక్షమయ్య, రంగమ్మలు రాగా వారిపైనా దాడి చేసి కొట్టారని శిరీష్ ఫిర్యాదు చేసింది. మురళీ, రంగమ్మ, భిక్షమయ్యలను ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ తలారి రామకృష్ణ తెలిపారు.

రోహిణి దెబ్బకు విలవిల

నిర్మానుష్యంగా రహదారులు



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వద్ద నిర్మానుష్యంగా రాష్ట్ర రహదారి

తాడేపల్లిగూడెం రూరల్: రోహిణి కార్తె ఈ ఏడాది ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కార్తె ముగుస్తుండటంతో ఎండ తీవ్రత మండిపోతోంది. దీనికి తోడు ఉక్కపోత అధికంగా ఉండటంతో చిన్నారులు, వృద్ధులు సతమతమవుతున్నారు. గత మూడ్రోజులుగా ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం 1.30 గంట ప్రాంతానికి 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఆదివారం అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, ఉక్కపోత మాత్రం 49 డిగ్రీలుగా నమోదైంది. ఈ నేపథ్యంలో ప్రజలు అల్లాడిపోయారు. దీనికి తోడు అప్రకటిత విద్యుత్ కోతతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. ఎండ తీవ్రతకు గాలి పంకాల నుంచి వస్తున్న గాలి సైతం వేడిగా రావడంతో జనం ఇబ్బందిపడ్డారు. ఎండ తీవ్రతకు పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. జ్యూస్ కార్నర్‌లు మాత్రం కళకళలాడుతున్నాయి. ఎండ తీవ్రతకు దప్పిక తీర్చుకునేందుకు జ్యూస్ కార్నర్‌లను ప్రజలు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఆయా సెంటర్లు రద్దీగా కనిపిస్తున్నాయి. మృగశిర కార్తె ఈ నెల 8న ప్రవేశిస్తుంది. అప్పటి వరకు రోహిణి కార్తె ఎండ తీవ్రత ఇలానే కొనసాగవచ్చని ఆందోళన చెందుతున్నారు.

వడదెబ్బతో లారీ డ్రైవర్‌కు గుండెపోటు



లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

భీమడోలు: జాతీయ రహదారి గుండుగొలను, సూరప్పగూడెం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం ఓ లారీ డ్రైవర్ వడదెబ్బతో గుండెపోటుకు గురయ్యాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న లారీ డ్రైవర్‌ను భీమడోలు 108 అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. వివరాల్లోకి వెళ్లితే.. కడప నుంచి రాజమండ్రి వైపుగా లారీ వెళ్తుండగా మార్గమధ్యమైన గుండుగొలను శివారు సూరప్పగూడెం ఫ్లైఓవర్ వంతెన వద్దకు వచ్చేసరికి కడపకు చెందిన లారీ డ్రైవర్ మార్తల గురివిరెడ్డి వడదెబ్బ తగిలి గుండెపోటుకు గురై డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆపస్మారక స్థితిలో ఉన్న లారీ డ్రైవర్‌ను భీమడోలు 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌కు చెందిన ఓ ఫైల్‌లో రూ.40,810 నగదు, లారీ రికార్డులు, శ్యామ్‌సంగ్ మొబైల్ గుర్తించి వాటిని హైవే పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

బీచ్ క్లీనింగ్‌కు పిలుపు

మొగల్తూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పేరుపాలెం తీరంలో నిర్వహించనున్న బీచ్ క్లీనింగ్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు తరలిరావాలని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ రవిప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు రానున్నారని, ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

క్లుప్తంగా

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష



వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్ : ఐఐటీ–జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష మండలంలోని పెదతాడేపల్లి శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ కేంద్రంలో 240 మంది అభ్యర్థులకుగాను 228 మంది పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు వివరించారు. పరీక్షలను సెంటర్ కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు.

చింతామణి దేవికి జేష్ట పౌర్ణమి పూజలు



విశేషాలంకరణలో చింతామణిదేవి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జేష్ట పౌర్ణమి పురస్కరించుకొని పట్టణంలోని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఆదివారం చింతామణిదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. శ్రీలక్ష్మి, అష్ట లక్ష్మి స్తోత్రాలు, మణిద్వీప వర్ణన పారాయణం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మదన గోపాలునికి తీర్థపు బిందె సమర్పణ



వెండి తీర్థపు బిందెను సమర్పిస్తున్న సూర్యబలిజ సంక్షేమ సంఘ సభ్యులు

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో ఉన్న శ్రీ మదన గోపాలస్వామి వారికి వెండి తీర్థపు బిందెను ఆదిఆవరం భక్తులు సమర్పించారు. అత్తిలి మండలం బల్లిపాడు, తణుకు మండలం దువ్వ గ్రామాలకు చెందిన సూర్యబలిజ సంక్షేమ సంఘం తరపునన కిలో వెండితో తయారు చేయించిన తీర్థపు బిందెను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీకి అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో తీర్థపు బిందెకు సంప్రోక్షణా పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ధ్యానంపై అవగాహన



పిరమిడ్ మాస్టర్ అనసూయ

అత్తిలి: స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భీమవరం పట్టణానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ అనసూయ ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో దాసం ప్రసాద్, జి.గణేష్, బి.వెంకటేశ్వరరావు, ఎం.భాస్కరరావు, శ్రీదేవి, కళావతి, బి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై చెత్త నిల్వలు లేకుండా చూడాలి



తణుకులో డ్రైయినేజీలోని వ్యర్థాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

తణుకు అర్బన్: రహదారులపై చెత్త నిల్వలు లేకుండా అధికార యంత్రాంగం కృషి చేయాలని నరసాపురం సబ్ కలెక్టర్, తణుకు మునిసిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ సూర్యతేజ అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాలను ఆదివారం పర్యవేక్షించారు. రహదారులపై ఉన్న చెత్తాచెదారాలు, డ్రైయినేజీల్లో పూడిక నిండి ఉండడాన్ని గుర్తించి వెంటనే శుభ్రపరచాలని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. చెత్త, వ్యర్థాలను రహదారులపై నిల్వ ఉండడం వల్ల పలు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మళ్లీ ఇదే ప్రాంతాలపై తన పర్యవేక్షణ ఉంటుందని వ్యర్థాలతోపాటు పూడికతీత పనులను పూర్తి చేయాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి వ్యాఖ్యలు సిగ్గుచేటు



అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

అత్తిలి: అత్తిలిలో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌పై రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రికారుమూరి నాగేశ్వరరావు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులపై తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ అత్తిలిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసే విషయం ఒకరోజు ముందు మంత్రి దృష్టికి వచ్చిందని, దీనిపై మంత్రి స్పందిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ బార్ రెస్టారెంట్ ఏర్పాటు తగదని చెప్పారన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే బార్‌ను ఏర్పాటు చేశారని, దీనిపై మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ బార్‌ను సందర్శించి అనవసర రాద్ధాంతం చేశారని దుయ్యబట్టారు. బార్ ఏర్పాటుకు మంత్రికి గానీ, వైఎస్సార్ సీపీ నాయకులకు గానీ ఎలాంటి సంబంధంలేదన్నారు. బార్ ఏర్పాటు చేశారన్న సమాచారం తెలిసిన వెంటనే మంత్రి తక్షణమే స్పందించి బార్‌ను మూయించి వేశారని చెప్పారు. టీడీపీ నాయకులు అధికార పార్టీ నాయకులపై బురదజల్లుతున్నారని మండిపడ్డారు. బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసిన ప్రదేశం టీడీపీ సానుభూతి పరులకు చెందినదేనని తెలిపారు. అనంతరం అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మద్యం నియంత్రణపై తీసుకున్న నిర్ణయాలతో మద్యం దుకాణాలు తగ్గాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హాయంలో మద్యం ఏరులై పారేదని, నేడు మద్యం దుకాణాలు తగ్గించడంతో పాటు బెల్టు షాపులు రద్దు చేశారన్నారు. అత్తిలిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు సంఘటనపై టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కించపరిచే విధంగా జనసేన పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెడుతున్నారని, ఇలాంటి విధానాన్ని విడనాడకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సివస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండలనాయకులు కందుల సత్యనారాయణ, రంభ సూరిబాబు, గంటా నాగరాజు, కంకటాల సతీష్, కోరుకొల్లు వెంకట్రావు, గంటా నాగరాజు, చిటకన వెంకట్రావు, దిరిశాల నాగబాబు పాల్గొన్నారు.

ఉల్లాసంగా వేసవి శిక్షణా తరగతులు



గ్రంథాలయంలో ఆట పాటలలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఆదివారం వేసవి శిక్షణా తరగతులు ఉత్సాహంగా జరిగాయి. జన విజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, పుస్తకాలు చదివించడం, ఆట పాటలు నేర్పించారు. విశ్రాంత ఎంఈఓ ఎస్.సాల్మన్‌రాజు ఇంగ్లిషు గ్రామర్, కొత్త పదాలు నేర్పించారు. మహాశివభట్టు లక్ష్మణరాజుచే తెలుగులో దేశభక్తి గీతాలు, సూక్తులు, పద్యాలు నేర్పించారు. ఎ.జనార్ధనరావుచే హిందీ పాఠాలు బోధించారు. ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి గరికపాటి బాపయ్య శర్మ సామెతలు, నీతి కథలు చెప్పారు. పి.భాస్కరరావు విద్యార్థులకు స్వీట్లు పంచారు.

ఎస్సీ వర్గీకరణతోనే జాతి భవిష్యత్తుకు మేలు



ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ సమావేశంలో నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఎస్సీ వర్గీకరణతోనే జాతి భవిష్యత్తుకు మేలు చేకూరుతుందని ఎమ్మార్పీఎస్ నూతన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి విస్సంపల్లి సిద్దు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక, అనుబంధ సంఘాలు, ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉత్తరాంధ్ర కోస్తా జిల్లా పరిశీలకులు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాట్లాడుతూ మందా కృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు గో టూ విలేజ్ మిషన్ పిప్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విద్యావంతులను ఉద్యమంలోకి తీసుకురావాలన్నారు. త్వరలో జరగబోవు హైదరాబాద్ మహాసభకు లక్షల మందిని తరలించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నూతన కమిటీలో జిల్లా ఉపాధ్యక్షుడిగా దూలపల్లి శ్రీనివాసరావు, తాడేపల్లిగూడెం మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా ఆకుల రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా కంకట రత్నకుమార్, కోకన్వీనర్‌గా జి.ప్రేమకుమార్, రూరల్ మండల ఇన్‌చార్జిగా పెద్దముత్తి చిన్ని, మండల కో కన్వీనర్‌గా ఇల్లెందుల వీర్రాజు, మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి జిల్లా నాయకులు పలివెల పైడియ్య ఎన్నికయారు. పోలవరం కన్వీనర్ జుజ్జువరపు వాసు, కేఎస్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మెరిపో జాన్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా ధనకొండాలమ్మ జాతర



ధనకొండాలమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

యలమంచిలి: అడవిపాలెం, మేడపాడు, పెనుమదం, కొంతేరు గ్రామాల సరిహద్దులో వరి చేల మధ్యలో పాలకొలను సర్వేశలింగం పొలంలో వెలసిన ధనకొండాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా అమ్మవారికి కుంభం పోశారు. అనంతరం ఊయల ఉత్సవం చేసి అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. నాలుగు గ్రామాలకు చెందిన రైతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరలో నాలుగు గ్రామాలతోపాటు పరిసర గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో జాతరకు వచ్చిన భక్తులందరికీ మాంసాహారంతో భోజనాలు ఏర్పాటు చేశారు.

అలరించిన నృత్యప్రదర్శనలు



శిల్పారామంలో ప్రదర్శనలు ఇస్తున్న దామెర్ల కనక విజయలక్ష్మి శిష్యులు

నరసాపురం: తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ, రాధికా సంగీత నృత్య అకాడమీ సంయుక్తంగా హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన నృత్య పోటీల్లో నరసాపురం శ్రీ నటరాణి నృత్య అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు. అకాడమీ డైరెక్టర్, నాట్యాచారిణి ఆధ్వర్యంలో ఆమె శిష్యులు యామిని సరస్వతి, ఆనందిత, నేహ, సుమేధ, మానస, చరణి, దక్షిత, చరణ్య తదితరులు శనివారం ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి నృత్యాలతో అలరించిన విద్యార్థులను తెలంగాణా భాషా సాంస్కృతికశాఖ అధికారులు, అతిథులు అభినందించారు. నిర్వాహకులు విద్యార్థులకు షీల్డ్‌లు, సర్టిఫికెట్‌లు అందించారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం



మొగల్లులో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీవీఎల్

పాలకోడేరు: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. మొగల్లులోని సచివాలయం–2 పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని, ఆ లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. గ్రామస్థాయిలో ప్రాథమిక వైద్య సేవలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. రూ.17.50 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు నెలాఖరుకల్లా భవన నిర్మాణ పూర్తయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే సచివాలయం–1 పరిధిలో భవన నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రజలకు నిరంతరం సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాటూరి శాంత కుమారి, పెన్మత్స వెంకటలక్ష్మి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు పెన్మత్స వెంకటరాజు (బాబు) పెన్మత్స నాగరామకృష్ణంరాజు, మంతెన బాపిరాజు, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, బలే చిట్టిబాబు, సైదు శివలింగేశ్వరరావు, జి.సత్యకృష్ణ, వీరమల్లు అశోక్, గోడి భూషణం, కోరుకొల్లు దాసు, కడిమి కుమార్, కొప్రకూటి కొండ, పంపన శ్రీను, మద్దుల మౌళి, గొడవర్తి వెంకటేశ్వరరావు, సకినేటిపల్లి మాణిక్యాలరావు, కాంట్రాక్టర్ గొడవర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ముగిసిన వేసవి శిక్షణ

పెనుమంట్ర: మండల మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో మార్టేరులోని శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో నెలరోజుల పాటు నిర్వహించిన వేసవిశిక్షణా శిబిరంలో ఆదివారం ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. మానవత సంస్థ అధ్యక్షులు చిర్ల శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోచింగ్ క్యాంపులో పాల్గొని వివిధ ఈవెంట్లలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కోచింగ్ క్యాంపులో నిర్వహించిన గీతా శ్లోకాలు, యోగా, చెస్, కుంగ్‌ఫూ, చిత్రలేఖనం పోటీలలో ప్రథమ స్థానాలు పొందిన కె.జస్మిత, టి.సహస్ర, కె.శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనిధి, కె.రోహిత్, ఎస్.రామసాత్విక్, ఎస్.గాయత్రితనీషాలకు ప్రశంసా పత్రాలను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ముఖ్య అతిథులుగా మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్ప, జిల్లా కన్వీనర్ పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి పాల్గొన్నారు.

8న మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక

పెంటపాడు : పెంటపాడు మండల సమావేశ మందిరంలో ఈనెల 8న మండల ప్రజాపరిషత్ 2వ ఉపాధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అదే రోజు మండల ప్రత్యేకాధికారి, డీపీవో జీవీకే మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నరసింహునికి చక్రస్నానం

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీకుంతీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో అర్చకులు మాధవాచార్యులు చక్రస్నానం చేయించారు. అనంతరం దేవేరులకు మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పయాగం అనంతరం మహిళ భక్తులకు పసుపు, కుంకుమ, ప్రసాద వితరణ చేశారు. ఈ నెల 11వ తేదీ ఆదివారం గ్రామస్తులు, భక్తుల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించడంతో ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ చెప్పారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు, ఈఓ డి.రామకృష్ణంరాజు, సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు అల్లూరి సత్యనారాయణ సాంస్కృతిక కేంద్రం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు యువతులు ఉన్నట్టు టౌన్‌ఎస్సై ప్రసాద్ తెలిపారు. గోదావరి గట్టు రోడ్డులో రేవులో బెనర్జీ అనే వ్యక్తి ధరణీ లలిత, దీప్తి అనే ఇద్దరు యువతులను ఎక్కించుకుని పంటు రేవువైపు వస్తుండగా, అల్లూరి కల్యాణ మండపం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో ముగ్గురు గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వారిని భీమవరం తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



అప్పటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

పెంటపాడు : స్థానిక ప్రభుత్వ బేసిక్ స్కూల్‌లో 2003–04 నాటి పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు తొలిసారిగా కుటుంబ సభ్యులతో సహ ఈ వేడుకకు హాజరయ్యారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మిత్రులతో ఆటపాటలతో సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హౌసీ, కుర్చీలాట తదితర క్రీడలతో ఉల్లాసంగా గడిపారు. చిన్నారులు నృత్యాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి గురువులు విజయకుమారి (సోషల్), సూర్యబాల (ఇంగ్లిషు), సత్యనారాయణ (ఎస్ఎస్), ప్రసాద్, (పీఎస్), సుబ్బారావు (గణితం), జ్యోతి, రత్నకుమారి (హిందీ), డ్రిల్ ప్రమీల తదితర ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం అందరూ కలిసి భోజనాలు చేశారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి పూజలు



గుంపర్రులో జేష్ట పౌర్ణమికి ఏరువాక పూజలు చేస్తున్న రైతులు

యలమంచిలి: జ్యేష్ట పౌర్ణమి సందర్భంగా ఆదివారం గుంపర్రు గ్రామంలో రైతులు ఏరువాక పూజలు చేశారు. ప్రతి ఏడాది జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమికి రైతులు ఏరువాక పూజలు చేయడం ఆనవాయితీ. వేసవి ఎండలు తగ్గి తొలకరి జల్లులు పడే సమయంలో వరి సేద్యంలో ప్రధానమైన వరి విత్తనాలు వేయడానికి ముందు చేనును నాగలితో దున్నడమే ఏరువాక. వరి సేద్యంలో పాడి పశువుల ప్రాధాన్యత కూడా ఎక్కువ కాబట్టి ఈ రోజు పశువులకు శుభ్రంగా స్నానం చేయించి వాటి గిట్లకు పసుపు కుంకుమలు పూసి పూజలు చేస్తారు. అలాగే బెల్లం, బియ్యం, ఆవు పాలతో పులగం వండి పశువులకు పెడతారు. ఈ ఏడాదిలో వచ్చే సార్వా, దాళ్వా పంటలు సక్రమంగా పండి రైతులకు అధిక లాభాలను చేకూర్చాలని ప్రకృతిని వేడుకుంటూ ఈ పూజలు చేస్తారు. ఆ విధంగా రైతులు ఆదివారం గుంపర్రు గ్రామంలో వరిచేల్లో ఏరువాక పూజలు చేసి పశువులకు పులగం వండి పెట్టారు. కార్యక్రమంలో రైతులు జడ్డు బదరీనారాయణ, రంగారావు, ఉలసి సత్తిబాబు, ఉలసి ఏసుబాబు, నాగులు, విష్ణుమూర్తి, పితాని కోటేశ్వరరావు, ఎం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూసర్వేతో సమస్యలకు పరిష్కారం



కొడమంచిలిలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

పెనుగొండ: జగనన్న భూ సర్వేతో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రైతన్నల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం అన్నారు. ఆదివారం కొడమంచిలిలోని ఉన్నత పాఠశాల వద్ద ఏరియల్ సర్వే ప్రారంభించారు. రెవెన్యూ వ్యవస్థలోనే ఎపుడూ లేని విధంగా కొత్త ఒరవడిని సృష్టించి ప్రతీ రైతు సమస్య తీర్చడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, దేవస్థానం చైర్మన్ బాలనాగు నరేష్, డీటీ లక్ష్మీ, ఆచంట సీతారామ్, కె.నర్సింహరాజు, చలం, సూర్యనారాయణ, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

చినమావుళ్లమ్మ ఆశీస్సులు అందరికీ ఉండాలి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం 36వ వార్డు రామరాజు తోటలో వేంచేసియున్న శ్రీచినమావుళ్ల అమ్మవారి 38 వార్షిక మహోత్సవ జాతరను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికి ఉండాలన్నారు. అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలను ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారి జాతరలో పలు కళాప్రదర్శనలు, తీన్‌మార్, సన్నాయి వాయిద్యాలు, అసాదుల నృత్యాలు భక్తులను అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్ రాజు, గాదిరాజు తాతారాజు, మావూరి సుందరరావు, చింతాడ శ్రీను, అమ్మవారి సేవా సమితి అధ్యక్షులు రామాయణం రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి రేవూరి గోగురాజు, సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

12 నుంచి అమ్మవార్ల ఆషాఢ మాస జాతర

వీరవాసరం: రాయకుదురులో వేంచేసిఉన్న శ్రీమావుళ్ళమ్మ, మహాలక్ష్మి, పోతురాజు స్వామివార్ల ఆషాఢమాస జాతర మహోత్సవాలు ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తామని అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ మంతెన వరప్రసాద్ చెప్పారు. శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. 12న అమ్మవార్లను దేవాలయం నుంచి తీసుకువచ్చి పూరి గుడిసెలో పెట్టడం జరుగుతుంది. 16న గమల్ల గుడుపు, 17న మేళతాళాలతో బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల గరగోత్సవం, 18న గ్రామం నుంచి అమ్మవార్లను ఆలయంలోనికి పునఃప్రవేశం జరుగుతుందని వివరించారు. ముందుగా శ్రీమావుళ్లమ్మ, మహాలక్ష్మి, పోతురాజు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

రైస్ కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం

ఉండి: రైస్ కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు కల్పించిందని, దీనిని పేదలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఏవీ అప్పారావు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో రైస్ కార్డు నుంచి తొలగించిన వారు లేదా కొత్తగా కార్డులో నమోదు కావాల్సిన వారికి ప్రస్తుతం సచివాలయాల్లో పేర్ల నమోదు జరుగుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఒంటరి వ్యక్తులకు రైస్ కార్డు మంజూరు చేయనున్నారన్నారు. అలాగే రైస్ కార్డులో కొత్తగా పేరు చేర్చేవారి ఆధార్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌ను అందించాల్సి ఉంటుందన్నారు. అలాగే కార్డు, కార్డులోని వ్యక్తుల బదిలీ కొరకు ప్రస్తుతం అవకాశం ఉందన్నారు. కొత్త రైస్ కార్డు కొరకు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.